
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





	ఇఫ్తార్ సోమవారం	సెహరి మంగళవారం
కర్నూలు	6: 32	5:08
నంద్యాల	6: 29	5:07



టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక ఉత్కంఠ వీడింది. రాయలసీమ నుంచి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ బెందుల తిరుమల నాయుడు (బీటీ నాయుడు)కు అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరో చాన్స్ ఇచ్చారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచే కాక.. రాయలసీమ జిల్లాల నుంచి సీనియర్ నేతలు, రాజకీయ ఉద్దండులు పోటీ పడినా.. చంద్రబాబు విశ్వసనీయతకు పట్టం కట్టారు. ఎమ్మెల్యే కోటా కింద టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను ఆదివారం సీఎం చంద్రబాబు ప్రకటించారు. ముగ్గురు జాబితాలో బీటీ నాయుడు పేరు ఉండడంతో ఆయన వర్గీయులు, టీడీపీ శ్రేణులు ఆనందంతో సంబరాలు చేసుకున్నారు. చంద్రబాబు, యువనేత లోకేశ్ నిజాయితీ, నమ్మకం, విశ్వసనీయతకు పట్టం కట్టారు అంటూ బీటీ నాయుడు అనుచరులు హర్షం వ్యక్తం చేశారు.



విశ్వసనీయతకు పట్టం

- ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీటీ నాయుడుకు మరో అవకాశం
- అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్‌తో అనుబంధం
- సీమ జిల్లాల నుంచి బీటీకి చాన్స్
- నేడు నామినేషన్ దాఖలు
- హర్షం వ్యక్తం చేస్తున్న బీటీ అభిమానులు, టీడీపీ శ్రేణులు

కర్నూలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలం జుమాలదిన్నె గ్రామానికి రైతు దంపతులు బుడ్డన్న, అయ్యమ్మ కుమారుడు బీటీ నాయుడు. ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే పూర్తి చేసిన ఆయన 8-10వ తరగతి వరకు ఆదోని వైఎంకే స్కూల్, ఇంటర్మీడియట్ ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పూర్తి చేశారు. తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయంలో ఐదేళ్ల న్యాయ విద్య పూర్తి చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఏ పట్టా అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిజం పీజీడీసీ పూర్తి చేశారు. ఎమ్మిగనూరు, ఆదోని, కర్నూలు కోర్టుల్లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐలో కీలకంగా పని చేస్తూ రాజకీయాల పట్ల మమకారం పెంచుకున్నారు. 1997లో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలనే ఉద్యమంలో అడుగు పెట్టారు. అంచెలంచెలుగా ఉద్యమంలో ఎదిగారు. వాల్మీకి సింహగర్జన పేరుతో సీమ జిల్లాల్లో వేలాది సమీకరించి సభలు నిర్వహించారు. బీసీ, దళిత హక్కుల సాధన ఉద్యామాల్లో పని చేశారు. ప్రజా సంఘాల్లో కీలకంగా పని చేసిన ఆయన రాజకీయాలపై ఉన్న మక్కువతో 1994లో నాటి ఆదోని ఎమ్మెల్యే కె. మీనాక్షినాయుడు నాయకత్వంలో క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న బీటీ నాయుడు రాజకీయ మలుపులు దాటుకుంటూ టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడు, నమ్మకస్తుడిగా ఎదిగారు. 30 ఏళ్ల టీడీపీ రాజకీయ ప్రస్థానంలో ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల ఇన్‌చార్జిగా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా, వివిధ జిల్లాల పార్టీ ఇన్‌చార్జిగా, పార్లమెంట్ నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిగా పని చేశారు. 2023 నుంచి 2024 ఏప్రిల్ వరకు టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. అంతేకాదు.. కర్నూలు పార్లమెంట్ స్థానం నుంచి 2009, 2014లో రెండు పర్యాయాలు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీలో తనకుంటూ ఓ ప్రత్యేక స్థానం పదిలం చేసుకున్నారు. అధినేతకు చంద్రబాబుకు విశ్వసనీయుడిగా మారారు. అదే ఆయనను రాజకీయంగా ఉన్నత శిఖరాలకు చేర్చిందని ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు.

ఎమ్మెల్సీగా మరో అవకాశం



2019 మార్చిలో జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అధినేత, నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు తొలిసారిగా బీటీ నాయుడుకు ఎమ్మెల్సీ అవకాశం ఇచ్చారు. రాయలసీమ జిల్లాల్లో బలమైన వాల్మీకి సామాజికవర్గం కోటాలో ఆయనకు అవకాశం దక్కింది. ఎమ్మెల్సీ పదవి దక్కినా.. పార్టీ అధికారం కోల్పోయి ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చింది. ఆ సమయంలో శాసన మండలిలో బలం లేని వైసీపీ అధిష్ఠానం, నాటి సీఎం జగన్ బీటీ నాయుడిని వైసీపీలో చేర్చుకోవడానికి ఎన్నో ఎత్తులు వేశారు. భారీ ఆఫర్ కూడా ఇచ్చారనే ప్రచారం అప్పట్లో జరిగింది. అయితే.. నమ్ముకున్న టీడీపీ, అవకాశం ఇచ్చిన చంద్రబాబు వెంటే నడిచారు. శాసనమండలిలో టీడీపీ విధానాలు గట్టిగా వినిపించారు. టీడీపీ ఫ్లోర్ లీడర్, మండలిలో ప్రొటెక్షన్ చైర్మన్ హోదాలో మండలిని నడిపించారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో 2023లో టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. ఆ సమయంలో పార్టీ బలోపేతం, యువనేత నారా లోకేశ్ పాదయాత్రను దిగ్విజయం చేయడంలో కీలకభూమిక పోషించారు. నంద్యాలలో చంద్రబాబు అరెస్ట్ సమయంలో అధినేతకు న్యాయపరంగా అండగా నిలిచారు. 53 రోజులు రాజమండ్రి జైల్లో ఉన్న సమయంలో కూడా ఢిల్లీ నుంచి వచ్చిన సీనియర్ న్యాయవాదులకు అధినేత చంద్రబాబుకు మధ్య సంధానకర్తగా పని చేశారు. ఎన్నికల ముందు రాజకీయ సమీకరణాల్లో భాగంగా టీడీపీ జిల్లా అధ్యక్ష పీఠం తిక్కారెడ్డికి ఇస్తామని అధినేత చంద్రబాబు చెబితే.. దానికి అంగీకరించారు. చంద్రబాబు, లోకేశ్‌లతో అంతటి నమ్మకాన్ని పెంచుకున్న బీటీ నాయుడికి అదే ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా మరోసారి అవకాశం దక్కడం కొసమెరుపు. జిల్లా నుంచి మాజీ మంత్రులు కేఈ ప్రభాకర్, ఏరాసు ప్రతాప్‌రెడ్డి సహా టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఆదోని ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు.. ఇలా ఎందరో నాయకులు ఆశించారు. రాయలసీమ జిల్లాల నుంచి మహామహులు ప్రయత్నాలు చేశారు. సీమలో బలంగా ఉన్న వాల్మీకి సామాజికవర్గానికి చెందిన బీటీ నాయుడు వైపే అధినేత మొగ్గు చూపారు.

అధినేత చంద్రబాబు నమ్మకాన్ని నిలబెడతాను

టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా, ఐటీ శాఖ మంత్రి యువనేత నారా లోకేశ్ నాపై ఎంతో నమ్మకంతో మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. వారి నమ్మకాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ వమ్ము చేయను. టీడీపీని నమ్ముకున్న కార్యకర్తకు, అంకితభావంతో పని చేసిన వారికి పదవులు వస్తాయనడానికి ప్రత్యక్ష సాక్షిని నేను. నమ్మకం, నిజాయితీగా పని చేస్తే అధినేత, యువనేత ఇద్దరు కూడా కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటారు. వారి రుణం జన్మతా తీర్చుకోలేనిది. ఎల్లప్పుడు నారా కుటుంబానికి రుణపడి ఉంటాను. నా 30 ఏళ్ల టీడీపీ రాజకీయ జీవితంలో ఏ బాధ్యత అప్పగించినా నిజాయితీగా నిర్వర్తించాను. నాకు సహకరించిన సీనియర్ నాయకులు, మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, ఉమ్మడి జిల్లా మంత్రులు టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి, ముఖ్యంగా నాకు రాజకీయ గురువు అయిన ఆదోని ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె. మీనాక్షినాయుడు, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు సహా సీనియర్ నాయకులు అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

- బీటీ నాయుడు, ఎమ్మెల్సీ

నేడు నామినేషన్ దాఖలు

ఎమ్మెల్సీ బీటీ నాయుడు పదవీ కాలం ఈ నెల 29తో ముగుస్తుంది. మళ్లీ అవకాశం రావడంతో మరో ఆరేళ్లు అంటే.. 2031 మార్చి 29 వరకు ఆయన ఎమ్మెల్సీగా కొనసాగే అవకాశం ఉంది. సోమవారం 11 గంటల సమయంలో శాసనమండలి సెక్రెటరీ జనరల్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తారు. ఆయన నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు సన్నిహితులు, అనుచరులు ఆదివారం రాత్రి అమరావతికి బయలుదేరారు.

పత్తి సేకరణలో కర్నూలుకు మూడో స్థానం



పెంచికలపాడులో రైతుల నుంచి పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఈ సంవత్సరం ఖరీఫ్‌లో పత్తి పంట సాగులో ఉమ్మడి కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచింది. మొదటి రెండు స్థానాల్లో గుంటూరు, కృష్ణా జిల్లాలు ఉన్నాయి. దాదాపు 2 లక్షల హెక్టార్లలో ఈ పంటను రైతులు సాగు చేశారు.. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎకరాకు 8 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్ల దాకా పత్తి దిగుబడి రైతుల చేతికి అందింది. పంట దిగుబడి అందినట్లుగానే సీసీఐ ద్వారా రైతుల నుంచి ఎక్కువ మొత్తంలో పత్తిని సేకరించేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మార్కెట్ కమిటీల సెక్రటరీలు ఎక్కువగా కృషి చేశారు. దీంతో రాష్ట్రంలోనే రైతుల నుంచి పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేసిన జిల్లాలో కర్నూలుకు మూడో స్థానం దక్కింది. కోడుమూరు మార్కెట్ కమిటీ పరిధిలోని పెంచికలపాడు సీసీఐ కేంద్రం ద్వారా 2,633 మంది రైతుల నుంచి 83,712 క్వింటాళ్ల పత్తిని రైతుల నుంచి సేకరించారు. అదే విధంగా ఆదోని మార్కెట్ కమిటీ పరిధిలో 7,240 మంది రైతుల నుంచి 1,70,655 క్వింటాళ్ల పత్తిని సేకరించారు. ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ పరిధిలో 4,975 మంది రైతుల నుంచి 98,493 క్వింటాళ్ల పత్తిని సేకరించారు. మంత్రాలయం మార్కెట్ కమిటీ పరిధిలో 2,320 మంది రైతుల నుంచి 52,829 క్వింటాళ్ల పత్తిని స్వీకరించారు. ఆయా మార్కెట్ కమిటీల పరిధిలో మొత్తం 17,168 మంది రైతుల నుంచి 4,48,074 క్వింటాళ్ల పత్తిని సేకరించడం జరిగిందని, వీరికి రూ.297.91 కోట్ల మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాలకు సీసీఐ సంస్థ ద్వారా జమ చేసినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. నంద్యాల జిల్లాలో సీసీఐ సంస్థ ఒక్క కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయ లేదు. అయినప్పటికీ ఆ జిల్లాలోని పత్తి రైతులకు గిట్టుబాటు ధర అందించేందు కోసం కర్నూలు జిల్లాలోని కోడుమూరు మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న పెంచికలపాడు కొనుగోలు కేంద్రం ద్వారా రైతులు తెచ్చిన పత్తిని సేకరించడంలో ఆ మార్కెట్ కమిటీ సెక్రటరీ సుందర్‌రాజు, సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, రషీద్ చర్యలు తీసుకోవడంతో రైతులు ప్రయోజనం పొందారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల నూనెపల్లె, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10:30 గంటలకు చేపడుతున్న ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరు కావాలని ఆమె తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

- బోగీలను తగిలిన బర్రెల మృత్యువాత
- గాజులపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఘటన
- పలు స్టేషన్లలో మూడు గంటల పాటు నిలిచిన రైళ్లు
- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు



పట్టాలు తప్పిన బోగీలు

మహానంది, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు-గుంతకల్లు రైల్వే మార్గంలో నంద్యాల జిల్లా మహానంది మండలంలోని గాజులపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. 242/8.5 కిలో మీటర్ల మధ్య ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. దీంతో ఆ మార్గంలో మూడు గంటల పాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వివరాలివీ.. నంద్యాల నుంచి నల్లపాడుకు ఖాళీ గూడ్స్ రైలు నంబర్ బీవోఎక్స్ఎన్-67 బయలు దేరింది. మార్గమధ్యంలోని గాజులపల్లి రైల్వే స్టేషన్ దాటగానే మధ్యాహ్నం 12.38 గంటల సమయంలో రెండు బర్రెలు ఆకస్మాత్తుగా గూడ్స్ రైలులోని 4, 5 బోగీలను ఢీకొనడంతో హోస్ పైపు తెగిపోయింది. దీంతో ఇంజన్‌కు బోగీల మధ్య సంబంధం తెగిపోయి ఆటోమెటిక్‌గా ఎమర్జెన్సీ బ్రేక్ అప్లయ్ కావడంతో గూడ్సు రైలు రెండు బోగీలు పట్టాలు తప్పాయి. ప్రమాదానికి కారణమైన రెండు బర్రెలు అక్కడిక్కడే చనిపోయాయి. గుంతకల్లు నుంచి యాక్సిడెంటల్ రిలీఫ్ ట్రైన్ గాజులపల్లికి చేరుకుంది. రైల్వే సాంకేతిక సిబ్బంది శరవేగంగా పట్టాలు తప్పిన గూడ్స్‌లోని రెండు బోగీలను క్రమబద్ధీకరించారు. దెబ్బతిన్న ట్రాక్‌కు మరమ్మతులు చేశారు. వీటిని గాజులపల్లి రైల్వే స్టేషన్‌కు తరలించారు. గూడ్స్ రైలును తిరిగి నంద్యాల రైల్వే స్టేషన్‌కు చేర్చారు. 02811 నెంబర్ గల భువనేశ్వర్-యశ్వంతపూర్ ప్రత్యేక రైలును ప్రకాశం జిల్లా గిద్దలూరు రైల్వే స్టేషన్‌లో రైల్వే అధికారులు మధ్యాహ్నం 2 గంటల సమయంలో నిలిపివేశారు. దీంతో ఆ రైలు మూడు గంటలు ఆలస్యంగా గాజులపల్లి మీదుగా వెళ్లింది. అలాగే కాచిగూడ నుండి గుంటూరుకు వచ్చే 17254 నెంబరు రైలును బేతంచెర్ల రైల్వే స్టేషన్‌లో నిలిపివేయడంతో ప్రయాణికులు మూడు గంటల పాటు ఇబ్బందులు పడ్డారు. కాగా గూడ్స్ వెళ్లేటప్పుడు స్టేషన్ సమీపంలోని ప్రధాన రహదారి గాజులపల్లి రైల్వే గేటు వేయడంతో బైక్‌పై వేచి ఉన్న మహానంది మండలం నందిపల్లికి చెందిన శ్యామ్ అనే యువకునికి రైల్వే ట్రాక్‌పై ఉన్న రాయి బలంగా తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే టిప్పర్‌కు కూడా రాయి తగలడంతో అద్దం పగిలిపోయింది. ప్రమాదానికి గల కారణాలను రైల్వే పోలీసులు విచారిస్తున్నారు. నంద్యాల రైల్వే సీఐ నాగభూషణం, బీవోఐ వెంకటేశ్వర్లు వెంకటేశ్వర్లు సిబ్బందితో చేరుకొని దెబ్బతిన్న ట్రాక్ మరమ్మతులు వేగవంతంగా జరిగేటట్లు చేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి: మంత్రి బీసీ



వినతులు స్వీకరిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను అధికారులు యుద్ధ ప్రాతికదిన పరిష్కరించాలని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్సు సెల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలనుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యపై వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలివచ్చి తమ సమస్యలను మంత్రికి వివరించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొన్ని సమస్యలపై అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించారు.

మోహినిగా జ్వాలా నారసింహుడు



ఎగువ అహోబిలంలో మోహిని అలంకారంలో జ్వాలా నరసింహస్వామి

- స్వర్ణ శేష వాహనంపై విహరించిన ప్రహ్లాదవరద స్వామి



దిగువ అహోబిలంలో గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఎగువ అహోబిలంలో వెలసిన జ్వాలా నరసింహస్వామి ఆదివారం ఉదయం మోహిని అలంకారంలో దర్శనమిచ్చారు. రాత్రి శరభ వాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్య పూజలు నిర్వహించిన అనంతరం శ్రీదేవి, భూదేవీ సమేత జ్వాలా నరసింహస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఉత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శరభ వాహనాన్ని అధిరోహించిన జ్వాలా నరసింహస్వామికి మంగళవాయిద్యాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు.

దిగువ అహోబిలంలో..

దిగువ అహోబిలంలో భూ నీలా సమేత ప్రహ్లాదవరద స్వామి ఆదివారం ఉదయం స్వర్ణ శేష వాహనంపై కొలువై ఆలయ మాడవీధుల్లో శోభాయమానంగా విహరించారు. ఉత్సవాల్లో భాగంగా వేకువజామున ప్రహ్లాదవరద స్వామి, అమృతవల్లి అమ్మవారికి సుప్రభాత సేవ, విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, అర్చన, మంగళ హారతి చేపట్టారు. నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్, రెవెన్యూ అధికారులు ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రహ్లాదవరదుడిని పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి చంద్రప్రభ వాహనంలో కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు ఉభయదారులుగా వ్యవహరించిన నంద్యాలకు చెందిన అవ్వారు గౌరీనాథ్ దంపతులు స్వామివారికి రూ.60 వేలు విలువ చేసే ఆరు బంగారు కంకణాలను బహూకరించారు.

నేటి కార్యక్రమాలు

అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరదస్వామి సోమవారం ఉదయం మోహిని అలంకారంలో దర్శనమిస్తారు. రాత్రి శరభ వాహనంపై విహరించనున్నారు. ఎగువ అహోబిల క్షేత్రంలో జ్వాలా నరసింహస్వామికి ఉత్సవం, పొన్నుచెట్టు వాహన సేవలు నిర్వహించనున్నారు.



స్వర్ణ శేష వాహనంపై కొలువైన ప్రహ్లాదవరద స్వామి



వాహన సేవలో పాల్గొన్న మఠం 46వ పీఠాధిపతి

దూదేకొండ వద్ద టమోటా ప్రాసెసింగ్ యూనిట్



- పనులు కేటాయించనున్న ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ
- 14న భూమి పూజ చేయనున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):
దశాబ్దాలుగా పత్తికొండ ప్రాంత రైతులు ఎదురు చూస్తున్న ఇంటిగ్రేటెడ్ టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పరిశ్రమలు, వాణిజ్యశాఖ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీల పేరిట రెండురోజుల క్రితం ప్రభుత్వం జీవోనెం 37ను విడుదల చేసింది. పత్తికొండ మండలంలోని దూదేకొండ గ్రామ సర్వేనెం 63/3లో 2.5 ఎకరాల్లో రూ.11కోట్ల నిధులతో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇస్తున్నట్లు జీవోలో పేర్కొంది. మార్చి 14న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఈ పనులకు భూమి పూజ చేయనున్నారు.

దశాబ్దాల కల..

పత్తికొండ ప్రాంతంలో ప్రధాన వాణిజ్యపంటలకు దీటుగా రైతులు టమోటాను సాగుచేస్తారు. ఏటా 700 నుండి 800 ఎకరాలలో సాగయ్యే టమోటా దిగుమతులను రైతులు పత్తికొండ మార్కెట్‌కు తరలించి అమ్ముకుంటారు. రాష్ట్రంలో రెండో పెద్ద టమోటా మార్కెట్‌గా పేరు ఉన్న పత్తికొండ మార్కెట్ నుండి వ్యాపారులు తెలంగాణ తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ఎగుమతి ప్రాంతాలలో టమోటా డిమాండ్‌ను బట్టి ఇక్కడి మార్కెట్లో రైతుల నుండి పంటను కొనుగోలు చేస్తుంటారు. దీనికి తోడు వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతుల వద్ద నుండి పంటను తక్కువ ధరకు కొనుగోలు చేస్తుంటారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో టమోటాకు గిట్టుబాటు ధర దొరక్క రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగడం, కడుపుమండి పంటను మార్కెట్‌లోనే పారబోసి వెళ్లడం సర్వ సాధారణం. దీంతో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే గిట్టుబాటు ధర లభిస్తుందని దశాబ్దాలుగా రైతులు ఎదురుచూస్తున్నారు.

నాడు జగన్ బటన్ నొక్కారు.. వదిలేశారు

టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఎన్నికల అస్త్రంగా వాడుకునేందుకు గత ప్రభుత్వం ప్రయత్నించింది. అందుకోసం పత్తికొండ సమీపంలో హోసూరు రహదారిలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. అందు కోసం 2023లో జీవోనెం 739ని విడుదల చేసింది. పత్తికొండ ప్రాంత రైతులు దశాబ్దాల కలనెరవేరుస్తున్నట్లు అప్పటి ఎమ్మెల్యే గొప్పలు చెప్పారు. ఈ ప్రాజెక్టుకు అప్పట్లో ముఖ్యమంత్రి హోదాలో జగన్మోహన్‌రెడ్డి అమరావతి నుండే బటన్ నొక్కి భూమిపూజ చేశారు. ఎన్నికల అస్త్రంగా వాడుకునేందుకు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం ప్రయత్నించిన వైసీపీ ప్రభుత్వం 2024 ఎన్నికలనాటి వరకు టమోటా ప్రాసెసింగ్‌యూనిట్‌కు సంబంధించి ఎలాంటి పనులను చేపట్టలేకపోయింది.



రెవెన్యూశాఖ ఏర్పాటు చేసిన బోర్డు



ప్రాసెసింగ్ యూనిట్‌కు అనువైన స్థలం ఎంపిక..

ఈ ప్రాంత అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా రైతుల దశాబ్దాల కల టమాటాప్రాసెసింగ్ యూనిట్ అంశాన్ని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పరిశ్రమలు, వాణిజ్యశాఖ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీల పేరిట రెండురోజుల క్రితం ప్రభుత్వం టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు జీవోనెం 37ను విడుదల చేసింది. రూ 11కోట్ల నిదులతో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన(ఆర్‌కేవివై), ఆపరేషన్ గ్రీన్స్ పథకం కింద ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈ పనులను పర్యవేక్షించేలా జీవోలో పేర్కొంది. గత ప్రభుత్వ హయాంలో జారీచేసిన 739జీవో పేర్కొన్న హూసూరు రోడ్డులోని సర్వేనెంబరు286:/1ఏ4 లో 2.5 ఎకరాల భూమి ప్రాజెక్టు ఏర్పాటుకు అనుకూలంగా లేకపోవడంతో దూదేకొండ సర్వేనంబర్ 63/3లోని 2.5 ఎకరాల స్థలంలో ఈ ఇంటిగ్రేటెడ్ టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేసింది.

9నెలల్లో ప్రాజెక్టు పూర్తిచేస్తాం

పత్తికొండ మండలంలోని దూదేకొండ వద్ద ఇంటిగ్రేటెడ్ టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. రూ 11కోట్లతో ఏర్పాటు కానున్న ఈ యూనిట్‌ను 9నెలల కాలవ్యవధిలో పూర్తిచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

\- ఉమాదేవి, పీడీ, ఏపీఎంఐపీ , కర్నూలు

వెల్లువెత్తిన ఫిర్యాదులు

ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కూరగాయల రైతులకు గిట్టుబాటు ధర అందించడానికి గత తెలుగుదేశం ప్రభుత్వం రైతు బజార్లను ఏర్పాటు చేసింది. ఈ రైతుబజార్ల నిర్వహణలో ఎటువంటి అక్రమాలు చోటు చేసుకోకుండా అవసరమైన చర్యలు కూడా చేపట్టింది. అయితే.. గత వైసీపీ ప్రభుత్వంలో రైతుబజార్లను నిర్వీర్యం చేయడంతో ఇటు రైతులు, అటు కూరగాయల కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మళ్లీ కూటమి ప్రభుత్వం రావడంతో రైతుబజార్ల వల్ల రైతులు, ప్రజలకు ప్రయోజనాలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీతకు ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఫిర్యాదులు వెలువెత్తుతున్న రైతుబజార్లలో ఎస్టేట్ అధికారుల బదిలీకి డైరెక్టర్ చర్యలు చేపట్టారు. కర్నూలు, నంద్యాల జిల్లాలోని ఐదు రైతుబజార్లలో పని చేస్తున్న ఎస్టేట్ అధికారులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తూ వారం క్రితం మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత ఉత్తర్వులు జారీ చేశారు. సీ.క్యాంపు రైతుబజారు ఎస్టేట్ అధికారి హరీష్‌ను ఆదోనికి బదిలీ చేశారు. ఆదోనిలో పని చేస్తున్న అక్తర్‌ను కర్నూలు నగరంలోని కొత్తపేట రైతుబజారుకు బదిలీ చేశారు. వెంకటరమణ కాలనీలోని ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మను సీ. క్యాంపు రైతుబజారుకు బదిలీ చేశారు. కొత్తపేట రైతుబజారు ఎస్టేట్ అధికారి జయలక్ష్మిని వెంకటరమణ కాలనీ రైతు బజారుకు బదిలీ చేశారు. రైతుబజార్లలో ఎస్టేట్ అధికారులతో పాటు సిబ్బంది కార్యకలాపాలపై మార్కెటింగ్ శాఖ ఏడీఎంలు తప్పనిసరిగా దృష్టి సారించి రైతులకు, ప్రజలకు ప్రయోజనాలు అందించాలని ఎక్కువగా రైతులే రైతుబజార్ల వల్ల పర్యవేక్షణ చేయాలని, అక్రమాలపై దృష్టి పెట్టాలని ఆయా జిల్లాల మార్కెటింగ్ శాఖ అధికారులకు డైరెక్టర్ విజయ సునీత ఉత్తర్వులు జారీ చేశారు.

12న వైసీపీ పోరుబాట

జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



పోరుబాట పోస్టరును విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

కర్నూలు న్యూసిటీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, నిరుద్యోగుల కోసం వైసీపీ అధ్వర్యంలో ఈ నెల 12న పోరుబాట కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్వీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువులకు ఇబ్బంది లేకుండ దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయంబర్స్‌మెంట్ ప్రవేశపెట్టారన్నారు. చంద్రబాబు హయాంలో ఫీజు రీయంబర్స్‌మెంట్ నిర్వీర్యమైందన్నారు. కూటమి ప్రభుత్వ బడ్జెట్‌లో విద్యాదీవెన, ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు ఊసేలేదన్నారు. ఈ సమావేశంలో కోడుమూరు ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్, కేడీసీసీ మాజీ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, సీనియర్ నాయకుడు గడ్డం రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌వో

వెల్దుర్తి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో శాంతికళ ప్రజలకు సూచించారు. మండలంలో రామళ్లకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రత్నపల్లె గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని, వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. జ్వరాలు, వాంతులు, వీరేచనాలు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ మాట్లాడుతూ గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను, డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయాలన్నారు. డ్రైనేజీల వద్ద తాగునీటి పైపుల లీకేజీ తనిఖీ చేసి నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఐవో నాగప్రసాద్, నోడల్ అధికారి రఘు, ఎపిడామాలజిస్టు వేణుగోపాల్, ఎంపీహెచ్‌ఈవో చలపతిరావు, డాక్టర్ భువనతేజ, హెల్త్ సూపర్‌వైజర్ మోహన్, ఆనమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ అభిమాని మృతి

గోనెగండ్ల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గ్రామ శివార్లలో శనివారం రాత్రి గుర్తు తెలియని వాహన డీ కొని ఒంటెడుదిన్నె గ్రామానికి చెందిన కురువ ఈరన్న(30) అనే టీడీపీ అభిమాని మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. కురువ ఈరన్న నాలుగేళ్లుగా పార్టీ టీషర్టు వేసుకొని యువగళం జెండాను చేతపట్టుకొని గోనెగండ్ల, ఒంటెడుదిన్నె, గాజులదిన్నె, హెచ్‌కైరవాడి గ్రామాలలో తిరిగేవాడు. ఈరన్న తల్లిదండ్రులు చిన్నతనంలోనే మృతి చెందారు. ఆలనా పాలన చూసుకొని వారు లేక పోవడంతో టీడీపీ జెండా చేపట్టి గ్రామాలు తిరుగుతూ ఎవరు అన్నం పెడితే వారి దగ్గర తింటూ తిరిగేవాడు. శనివారం రాత్రి గోనెగండ్ల నుంచి స్వగ్రామమైన ఒంటెడుదిన్నెకు కాలి నడకన వెళుతుండగా గుర్తు తెలియని వాహనం డీ కొట్టడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. స్థానికులు 108లో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుని అక్క నరసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

సీసీఐ కొనుగోళ్లపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆకస్మిక తనిఖీ

- పరిశ్రమల్లో దూది బేళ్లు, రికార్డుల పరిశీలన
- ఎమ్మెల్యే ఫిర్యాదుతో కదిలిన విజిలెన్స్ అధికారులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రైతుల నుంచి కనీస మద్దతు ధరతో పత్తి కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ చౌడేశ్వరి, ఏవో విశ్వనాథ్, మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డితో కలిసి శనివారం రాత్రి ఆదోనిలో తనిఖీలు చేశారు. మధ్యాహ్నం నుంచే క్షేత్రస్థాయిలో గ్రామాల్లోని రైతులు దగ్గరకు వెళ్లి విచారణ చేసుకున్నట్లు సమాచారం. సాయంత్రం సీసీఐ లీజుకు తీసుకున్న పత్తిపరిశ్రమలు ఎన్‌డీబీ ఎల్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమతోపాటు దారా శ్రీ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంతమంది రైతుల నుంచి పత్తిని కొనుగోళ్లు చేశారని, రైతుల ఖాతాలో జమ చేసిన చెల్లింపులుపై క్షుణ్ణంగా రికార్డులను పరిశీలించారు. సీసీఐ కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జీ భరత్‌తో విచారించుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి గత రెండు నెలల క్రితం సీసీఐ కొనుగోళ్లలో భారీ అక్రమాలు జరిగాయని దీనిపై విచారణ చేపట్టాలని ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్‌తో పాటు విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ చౌడేశ్వరి నేతృత్వంలో విచారణ చేపట్టారు. పత్తి పరిశ్రమల్లో నిల్వ ఉన్న దూది బేళ్లను, పరిశ్రమ నిబంధనలను విచారణకు సంబంధించి వివరాలను ప్రభుత్వానికి నివేదిక పంపనున్నారు.



ఎన్డీబీఎల్ పరిశ్రమలో సీసీఐ కొనుగోలు చేసిన దూది బేళ్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ చౌడేశ్వరి

దొంగ అరెస్టు.. బంగారు స్వాధీనం

నందికొట్కూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో 24 గంటల్లో నిందితుడిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సీఐ మాట్లాడుతూ శనివారం ఉదయం 12 గంటల ప్రాంతంలో పట్టణంలోని కురువ వీధికి చెందిన శ్రీనివాసులు ఇంట్లోకి దొంగలు చొరబడి బీరువాను పగలగొట్టి ఒక బంగారు గొలుసు, ఒక జత చెవి చుట్లు, ఒక జత చెంప చారలు, ఒక లాంగ్ చైన్ బంగారు వస్తువులను దొంగలించారని చెప్పారు. వీటి విలువ సుమారు రూ.2.40 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆదివారం 12 గంటల ప్రాంతంలో దొంగలించిన సొమ్మును అమ్ముకోవడానికి నందికొట్కూరు పట్టణ శివారులోని మార్కెట్ యార్డు సమీపంలో ఉండగా ఎస్ఐ సురేష్ బాబు, పోలీసు సిబ్బంది దొంగను చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. దొంగ ఓర్వకల్లు మండలం ఉశేనాపురం గ్రామానికి చెందిన చుక్కబొట్ల ప్రవీణ్(20)గా గుర్తించారు. గతంలో గొర్రెలు, మేకపోతులు దొంగలించిన కేసులో కూడా ఇతడు నిందితుడిగా ఉన్నట్లు చెప్పారు. పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

వివిధ బ్యాంకుల ద్వారా శ్రీమఠానికి రూ.1.07 కోట్ల విరాళం

మంత్రాలయం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి ఎల్ఐసీ 33 లక్షలు, కర్ణాటక బ్యాంకు రూ.22 లక్షలు, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.42లక్షలు, కెనరా బ్యాంకు రూ.10లక్షలు విరాళం ఇచ్చినట్లు మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం అభివృద్ధి కోసం మంత్రాలయంలో ఉన్న వివిధ బ్యాంకులు తమ వంతుగా విరాళాలు ఇచ్చి సహకరిస్తున్నాయని తెలిపారు. ఎల్ఐసీ ఇచ్చిన రూ.33 లక్షలతో భక్తుల తాగునీటి కోసం రెండు ఆర్వో ప్లాంట్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కర్ణాటక బ్యాంకు ఇచ్చే రూ.22 లక్షలకు మరో రూ.3 లక్షలు శ్రీమఠం నుంచి కలిపి రూ.25 లక్షలతో టీటీ వాహనం కొంటున్నట్లు తెలిపారు. ఎస్‌బీఐ ఇచ్చిన రూ.42 లక్షలతో ఆర్వో ప్లాంటు, యూపీవీసీ కియోస్క్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కెనరా బ్యాంకు ఇచ్చిన రూ.10 లక్షలతో బొలేరో వాహనానికి ఆర్డర్ ఇచ్చినట్లు తెలిపారు. వివిధ బ్యాంకుల మేనేజర్లతో పాటు బ్యాంకు ఎండీలు, డైరెక్టర్లకు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న వెంకటేశ్ జోషి

కర్నూలు బాలోత్సవం కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా పుల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా ధనుంజయ

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బాలోత్సవం కమిటీ ఎన్నికైంది. ఆదివారం కర్నూలు కేకే భవన్‌లో బాలోత్సవ కమిటీ సమావేశం నిర్వహించి కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మాంటి స్సోరి పాఠశాలల అధినేత రాజశేఖర్, అధ్యక్షుడిగా రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, గౌరవ సలహాదారులు క్లస్టర్ వర్సిటీ డీన్ డా. అక్తర్ భాను, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జంధ్యాల రఘుబాబు, ప్రధాన కార్యదర్శిగా డి., ధనుంజయ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జేవీవీ సీనియర్ నాయకులు డా.బడే సాహేబ్, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి. నరసింహ, ఆర్థిక నిపుణుడు మన్సూర్ రెహమాన్, సీఐటీయూ జిల్లా నాయకుడు బి. రామాంజనేయులు పాల్గొన్నారు.

తమ్మరాజుపల్లె ఘాట్‌లో దారి దోపిడీ

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌పై దాడి.. బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన దుండగులు

బేతంచెర్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పాణ్యం-బేతంచెర్ల, తమ్మరాజుపల్లె ఘాట్ రోడ్డులో బేతంచెర్ల వైపు బైకుపై వస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జశ్వంత్ అనే యువకుడిపై ట్రాలీ వాహనంపై వచ్చిన దుండగులు దాడి చేసి నాలుగు తులాల బంగారు, రెండు బంగారు ఉంగరాలను అపహరించుకుని వెళ్లారు. విషయం తెలిసిన వెంటనే 108 సిబ్బంది బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి గాయపడిన జశ్వంత్‌ను ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం 108లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. బేతంచెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే పసికందు మృతి

అందోళనకు దిగిన బాలింత బంధువులు



అందోళన చేస్తున్న పసికందు బంధువులు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతో అప్పుడే పుట్టిన పసికందు మృతి చెందినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. బాధితుల కథనం మేరకు.. గోనెగండ్లకు చెందిన నరసింహులు భార్య సువార్తమ్మ ప్రసవం కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఉదయం 10గంటలకు వచ్చింది. ప్రసవ సమయంలో డ్యూటీ డాక్టర్లు లేకపోవడంతో ఆ సమయంలో స్టాఫ్ నర్సులు డెలివరీ చేశారు. పసికందుకు సీరియస్‌గా ఉందని ప్రైవేట్ వైద్యశాలకు వెళ్లాలని చెప్పడంతో, పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్ళుతుండగా మార్గమధ్యంలో పసికందు మృతి చెందింది. దీంతో బంధువులు తిరిగి వచ్చి ప్రభుత్వ ఆసుత్రికి ముందు పెట్టి పసికందు శవాన్ని పెట్టి అందోళనరు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యుల నిర్లక్ష్యం వల్లే పసికందు మృతి చెందిందని ఆరోపించారు.

అందుబాటులో లేని డ్యూటీ డాక్టర్లు

ఆదివారం ప్రసవం కోసం వచ్చే వాళ్ళ కోసం గైనకాలజిస్టు, చిన్న పిల్లల వైద్యనిపుణులు అందుబాటులో ఉండాలి. అయితే వైద్యాధికారులు ఫోన్‌లోనే స్టాఫ్ నర్సులకు వైద్య సూచనలు చేయగా వారు సువార్తమ్మకు కాన్పు చేసినట్లు తెలుస్తోంది. చిన్న పిల్లల వైద్యనిపుణులు కూడా అట్లాగే ఫోన్‌లో వైద్య సూచనలు చేశారు. దీని వల్లే పసికందు మృతి చెందినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు.

వివరణ: డ్యూటీ డాక్టర్ సుమిత్రను దీనిపై వివరణ కోరగా.. ఉదయం 10గంటలకు డెలివరీ కోసం అడ్మిట్ చేసుకున్నామని అన్నారు. స్కాన్ చేసి చూడగా బేబి లోపల మలవిసర్జన చేసి ఉండడం వలన క్రిటికల్‌గా ఉందని వారికి ముందే చెప్పామన్నారు. డెలివరీ సమయాన రెండు పేగులు మెడకు చుట్టుకొని బైటికి రావడం వలన మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేశామన్నారు. అయితే వారు ఆలస్యం చేయడం వల్ల బేబి మృతి చెందిందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

ఓర్వకల్లు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై నన్నూరు గ్రామ సమీపాన యూటర్న్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైతు మృతి చెందాడు. నంద్యాల జిల్లా గడివేముల మండలం వండుట్ల గ్రామానికి చెందిన తలారి రంగనాయకుడు రోడ్డు దాటుతుండగా.. లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన రైతు ఓర్వకల్లులో పొగాకు విక్రయించి నన్నూరు వద్ద భోజనం చేసేందుకు రోడ్డు దాటుతుండగా.. ఈ ప్రమాదం సంభవించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్నూలు జైలుకు పోసాని



కర్నూలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఆదోని త్రీటౌన్ పోలీసులు నమోదు చేసిన కేసులో సినీ నటుడు, వైసీపీ నాయకుడు పోసాని కృష్ణమురళి కర్నూలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు. అయితే విజయవాడలోని భవానీపురం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో పోసానిని అక్కడి పోలీసులు కర్నూలు జైలు నుంచి పీటీ వారెంట్‌పై శనివారం ఉదయం 8 గంటలకు తీసుకెళ్లి విజయవాడ కోర్టులో హాజరు పరిచారు. అనంతరం విజయవాడ నుంచి కర్నూలుకు తరలించారు. ఆదివారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో జిల్లా జైలుకు చేరుకున్నట్లు తెలిసింది. వైసీపీ అధికారంలో ఉండగా.. టీడీపీ అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సహా వారి కుటుంబ సభ్యులపై పోసాని కృష్ణమురళి జుగుప్సాకర విమర్శలు చేసిన విషయం విషయం విధితమే.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ఆత్మకూరు రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు చేసిన ఉపాధి పనుల పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, ఏసురత్నం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ నాయక్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఇందిరేశ్వరం చెంచు గూడెంలో పర్యటించి చెంచు గిరిజన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులు చేపట్టిన ఉపాధి హామీ పనుల బిల్లులు నాలుగు వారాలైనా రాకపోవడంతో గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఐటీడీఏ అదికారులు నెల నెలా చెంచులకు ఉపాధి పనులు కల్పించి, 15 రోజులకు ఒకసారి బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజనులు రాజమ్మ, నాగన్న, వీరన్న, చెవిటన్న, నాగమ్మ, వీరమ్మ, గురువయ్యలు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి

కొత్తపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి-నంద్యాల ఎన్‌హెచ్-167కే కింద జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ప్రభుత్వ భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి నక్కస్వాములు, గుమ్మడాపురం సర్పంచ్ నక్కా విజయకుమార్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వారు మండలంలోని పాతమాడుగుల, ఎర్రమఠం, సింగరాజుపల్లి, దుద్యాల, గోకవరం గ్రామాల్లో జాతీయ రహదారి నిర్మాణాల్లో భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడారు. భూములు కోల్పోతున్న రైతులకు ఆన్‌లైన్ అడంగల్‌తో నిమిత్తం లేకుండా నష్టపరిహారం ఇస్తామని చెప్పి విస్మరించడం సరైంది కాదన్నారు. అనుభవంలో ఉన్న రైతులకు పరిహారం ఇవ్వని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

తిరుమలకు పాదయాత్రగా భక్తులు

మిడుతూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మిడుతూరులోని శ్రీలక్ష్మి చెన్నకేశవ దేవాలయం వద్ద నుంచి తిరుమల తిరుపతికి పాదయాత్రగా దాదాపు వంద మంది భక్తులు బయలుదేరారు. ఈ పాదయాత్రలో మిడుతూరు, నందికొట్కూరు, పగిడ్యాల గ్రామాల నుంచి గోవింద స్వాములు, భక్తులు తిరుమల తిరుపతికి పాదయాత్రగా పది రోజులకు తిరుమల తిరుపతికి చేరుకోనున్నారు.

పది విద్యార్థులకు ప్రోత్సాహకాలు

కొత్తపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని దుద్యాల హైస్కూల్‌లో ఈ ఏడాది నుంచి పదిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు విశ్రాంత తహసీల్దార్ పెసల జనార్దన్ నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు ఆ పాఠశాల హైస్కూల్ హెచ్‌ఎం కృష్ణమోహన్ తెలిపారు. దుద్యాల గ్రామానికి చెందిన రిటైర్డు తహసీల్దార్ జనార్దన్ తమ గ్రామ పాఠశాలలో పదో తరగతి పరీక్షలో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు రూ.5 వేలు, రూ.3వేలు, రూ.2వేల చొప్పున వారి తండ్రి లక్ష్మయ్య జ్ఞాపకార్థం ఈ ప్రోత్సాహం ఇస్తున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.

ప్రాంతీయ వ్యత్యాసం లేకుండా చూడాలి

పాణ్యం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకులను ప్రాంతీయ వ్యత్యాసం లేకుండా ఎస్టీలుగా గుర్తించాలని రాష్ట్ర వాల్మీకి బోయ న్యాయవాదుల జేఏసీ కోకన్వీనర్ రాంమోహన్‌నాయుడు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాల్మీకులకు కులవృత్తి లేదని ఆర్థికంగా, రాజకీయంగా అన్యాయం జరుగుతోందని అన్నారు. ఏపీలోని వాల్మీకులకు ప్రాంతీయ వ్యత్యాసం లేకుండా ఎస్టీలుగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వాల్మీకి బోయలు కోరుతున్నారన్నారు.

నియామక పత్రాల అందజేత

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎంపికైన నంద్యాల జిల్లా, పట్టణ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులకు రాష్ట్ర అధ్యక్షులు సుబ్రమణ్యరాజు నియామక పత్రాలను అందజేశారు. ఇటీవలే నంద్యాల జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంజీవీ రవీంద్రనాథ్, కార్యదర్శిగా వాసుదేవరెడ్డి, పట్టణ అధ్యక్షుడిగా బాలచంద్రుడు, కార్యదర్శిగా శ్రీనివాస్‌పాండేలతో పాటు ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి వారికి రాష్ట్ర అధ్యక్షుడు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో దండెదస్తగిరి, రసూల్‌ఆజాద్, తిరుపతి జిల్లా అధ్యక్షులు రమేష్‌బాబు, తదితరులు హాజరయ్యారు.

జానిమాజ్‌లు పంపిణీ


నంద్యాల కల్చరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల అంజుమన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అంజుమన్ షాదిఖానాలో నంద్యాలలోని అన్ని మసీద్‌లకు జానిమాజ్‌లు పంపిణీ చేశారు. అంజుమన్ అధ్యక్షులు ఎస్‌ఎండీ ఖుద్దూస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నమాజ్ చేసే వారి కోసం 4లక్షల 50 వేల రూపాయల విలువగల జానిమాజ్‌లను మస్జిద్ కమిటీలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో షేక్ అబ్దుల్ సమద్ అమ్జద్‌బాషా సిద్దిఖీ పాల్గొన్నారు.



జనావాసాల మధ్య మద్యం దుకాణం వద్దని కేజీ రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న స్థానికులు



బార్ల తెరిచారు..!



- మద్యం దుకాణదారుల ఇష్టారాజ్యం
- షాపుల వద్దే మందు తాగేలా ఏర్పాట్లు
- బెల్టు నిర్వాహకుల వద్దకే లిక్కర్ సరఫరా
- పట్టించుకోని పోలీసులు, అబ్కారీ శాఖ అధికారులు

జూపాడుబంగ్లా, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జూపాడుబంగ్లాలో మద్యం దుకాణాలు బార్లను తలపిస్తున్నాయి. మద్యం దుకాణాల్లోనే అన్ని సౌకర్యాలు కల్పించడంతో మద్యంప్రియులు అక్కడే కూర్చొని తెగ తాగేస్తున్నారు. ఘర్షణలు జరుగుతున్నాయని ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప పోలీసులు అటు వైపు వెళ్లడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్వాటర్‌పై రూ.10 ఎక్కువ అమ్ముతున్నారని ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. నియోజకవర్గంలోనే అత్యధికంగా జూపాడుబంగ్లా మండలంలోని మద్యదుకాణం రూ.4 లక్షల వరకు ప్రతిరోజూ జరుగుతోందని సమాచారం. అందుకే మద్యం దుకాణాలు దక్కించుకునే సమయంలో తీవ్ర పోటీ కూడా నెలకొంది. ఇటీవల ఈడిగ కులస్థులకు కూడా ప్రభుత్వం మండలానికి ఒకటి కేటాయించడంతో గత నెలలో జూపాడుబంగ్లాలో కేజీ రోడ్డు పక్కనే దుకాణం పెట్టడంతో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాస్తారోకో చేపట్టారు. ఇప్పటి వరకు అధికారులు వచ్చి పరిశీలించిన దాఖలాలు కనిపించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

- బెల్టు నిర్వాహకులకు పెరిగిన డిమాండు

జూపాడుబంగ్లాలో రెండు మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో బెల్టు నిర్వాహకులకు డిమాండు పెరిగింది. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఒక వైపు గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే బెల్టు తీస్తామని ప్రభుత్వం చెబుతున్నా అధికారులు మాత్రం ఆ దిశగా దాడులు చేయకపోవడం శోచనీయం. జూపాడుబంగ్లా మండలంలో ఒక్కో గ్రామంలో 4 నుంచి 5 వరకు బెల్టు నిర్వాహకులు మద్యాన్ని సీసాకు అధికంగా రూ.20 వరకు వసూలు చేస్తూ మద్యంప్రియుల జేబులకు చిల్లు పెడుతున్నారు. అది కూడా మద్యం కావాలని ఫోన్ల ద్వారానే విక్రయించుకుంటున్నట్లు తెలుస్తోంది. మద్యం ప్రియులు ఎక్కడ ఉంటే అక్కడికి తీసు కెళ్లి ఇస్తున్నట్లు సమాచారం. మద్యం దుకాణా లకంటే బెల్టు నిర్వాహకుల ద్వారానే డబ్బులు ఎక్కువగా వస్తున్నాయని మద్యం దుకాణదారులు బెల్టు నిర్వాహకులను వలలో వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. రెండు దుకాణాల నిర్వాహకులు తమ దగ్గర తీసుకోవాలని బెల్టు షాపుల వారిని పిలిపించుకుంటున్నారని తెలు స్తోంది. అధికారులు పట్టుకుంటే తామే జవాబు దారీగా ఉంటామని ఒప్పందాలు చేసుకుంటు న్నట్లు తెలుస్తోంది. ఏకంగా మద్యం దుకాణాల దారులే గ్రామాలకు తీసుకెళ్లి బెల్టు నిర్వాహకులకు మద్యం సరఫరా చేస్తున్నారంటే పరిస్థితి ఎల ఉందో అర్థం చేసుకోవచ్చు. పారుమంచాల గ్రామంలో ఒక మద్యం దుకాణదారుడు ఎమ్మార్పీ కంటే రూ.20కి తక్కువకు బెల్టు షాపుల నిర్వాహకులకు మద్యం సరఫరా చేస్తున్నట్లు సమాచారం. దీంతో మరో మద్యం షాపు నిర్వాహకుడు అధికార పార్టీ నాయకుల వద్ద పంచాయితీ పెట్టినట్టు తెలిసింది. ఎవరూ నష్టపోకుండా ఒక్కో మద్యం దుకాణం సగం, సగం గ్రామాలకు సరఫరా చేసుకోవాలని అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఏప్రిల్‌లో తర్తూరు జాతర జరగనుంది. రాష్ట్రంలోనే ప్రాముఖ్యత కలిగిన వ్యవసాయ జాతరగా పేరు ఉంది. 20 రోజుల పాటు జరగనున్న జాతరకు లక్షలాది మంది ఇతర ప్రాంతాల నుంచి తరలి వస్తారు. ఇక్కడ వారం రోజులపాటు మద్యం దుకాణం పెట్టుకో వడానికి అనుమతి కోసం అధికారపార్టీ నాయ కులను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

బెల్టు దుకాణాలను నియంత్రించకుంటే ఆందోళన

బెల్టు దుకాణాలను నియంత్రించకుంటే నందికొట్కూరు అబ్కారీ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతాం. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే మద్యం విక్రయించడం లేదు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. బెల్టు దుకాణాలు నిర్వహిస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ఒక వైపు చెబుతున్న అధికారుల్లో చలనం లేదన్నారు. బెల్టు నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులు దాడులు చేయడం లేదు. బెల్టు షాపుల నిర్వహిస్తున్నా వారిపై కేసులు నమోదు చేయాలి.

- వెంకటేశ్వర్లు, సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకుడు

మా దృష్టికి రాలేదు

గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. మా దృష్టికి వచ్చిన వెంటనే వారిపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం. మద్యం దుకాణాల్లోనే తాగుతున్నారని మా దృష్టికి వచ్చింది. అదే పునారావృతమైతే చర్యలు తీసుకుంటాం.

- రామాంజనేయులు, అబ్కారీశాఖ సీఐ, నందికొట్కూరు

అమ్మవారికి శ్రీచక్రార్చన

నంద్యాల కల్చరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల జగజ్జననీ నగర్‌లో వెలసిన జగజ్జననీ దేవి ప్రతిష్ఠా షోడశ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం ప్రభాత పూజ నిర్వహించారు. వివిధ రకాల పండ్ల దండలతో అమ్మవారి ఆలయాన్ని అలంకరించారు. వందలాది మంది భక్తులు అమ్మవారి సన్నిధికి చేరుకొని అమ్మవారికి నవావరణ పూజా విధితో శ్రీచక్రార్చన పూజలు నిర్వహించారు. అనంతరం మహామంగళహారతి కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులు తమ ఇళ్ల వద్ద నుంచి గండ దీపాలు వెలిగించి అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. అలాగే అన్ని రకాల కూరగాయలను దండలుగా కట్టి అమ్మవారికి సమర్పించుకున్నారు. సాయంత్రం ప్రదోష పూజ, మహా మంగళహారతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

వైభవంగా శ్రీదేవి భూదేవి సహిత వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం

నంద్యాల బాలాజి కాంప్లెక్స్ కళ్యాణ మండపంలోని ఆలయంలో కొలువై ఉన్న వెంకటేశ్వర స్వామి, సీతారాముల ఆలయాల్లో ఆదివారం వైభవంగా శ్రీదేవి భూదేవి సహిత వెంకటేశ్వర స్వామి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. దాతల సహకారంతో చేపట్టిన నూతన ద్వార బంధం ప్రారంభోత్సవం సందర్భంగా స్వామివార్ల శాంతి కళ్యాణం, సీతారాముల కళ్యాణం ఏకకాలంలో నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు, దాతలు పాలూరి రవికుమార్, ఆర్వేటి రాజరత్నం, నిర్వాహకులు కశెట్టి క్రిష్ణమూర్తి, ఆలయ అర్చకులు నిఖిలేష్ శర్మ, శేషు బాబు, భక్తులు పాల్గొన్నారు.

కురుకులాంబదేవి జయంతి ఉత్సవాలు ప్రారంభం



కురుకులాంబ దేవి ఆలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు మండలం కురుకుంద గ్రామంలో వెలసిన కురుకులాంబ దేవి ఆలయంలో జయంతి ఉత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. మార్చి 8 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వేద పండితులు గూడా వెంకటాచలపతి శర్మ తెలిపారు. ఆదివారం కురుకులాంబ అమ్మవారికి శ్రీసూక్త అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కుంకుమార్చలు, సహస్రనామ స్తోత్ర పారాయణాలు చేపట్టారు. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో అరుణ హోమం నిర్వహించారు.

సమస్యల పరిష్కారంలో చొరవ చూపుదాం

మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపుదామని మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన సమస్యలను వినతి పత్రాల ద్వారా మంత్రికి ప్రజలు అందజేశారు. ప్రతి సమస్యను నిశితంగా పరిశీలించి ఏదశలో పరిష్కారం అవుతాయో అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. ఆర్థికపరమైన అంశాలు ఉంటే ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల కల్చరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గోస్పాడు ఎస్‌ఐపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. ఆదివారం ఆయన నంద్యాల బీజేపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడారు. గోస్పాడు మండలం యాళ్లూరులో వైసీపీ నాయకులు ఇటీవల బీజేపీలో చేరడంతో మండలంలోని కొందరు నాయకుల మాటల విని ఎస్‌ఐ వారిపై కక్ష కట్టారన్నారు. బెల్టు షాపుల పేరుతో వారి ఇళ్లను సోదా చేయడం, మహిళలను దూషించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ అధికారులు స్పందించకుంటే డీజీపీ దృష్టికి తీసుకొని వెళ్తామన్నారు.

కబడ్డీ పోటీలకు స్పందన

నంద్యాల హస్పిటల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రంలోని వేంకటేశ్వర విద్యా మందిరంలో ఉమ్మడి జిల్లాల కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి బాలబాలికల పోటీలకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లాల కబడ్డీ సంఘం కార్యదర్శి ఏపీ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపిక పోటీలకు ముఖ్య అతిథులుగా కాశిరెడ్డి నాయన ఆశ్రమ నిర్వాహకులు శివశంకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డిలు పాల్గొన్నారు. దాదాపు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అలాగే బాలికల జట్టుకు బనగానపల్లెలో ఈ నెల 10 నుంచి 13వరకు శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రధాన కార్యదర్శి దండె నాగరాజు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు మారెళ్ల నాగరాజు, గోపినాయక్, సురేష్‌నాయుడు, ఓబులేసు భరత్‌రెడ్డి, బాషా, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

చదరంగం పోటీలు ప్రారంభం



చదరంగం పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ రవికృష్ణ

నంద్యాల హస్పిటల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో వివేకానంద ఆడిటోరియంలో జిల్లా స్థాయి బాలబాలికల చదరంగం పోటీలు ప్రారంభమయ్యాయి. అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రవికృష్ణ, రామసుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రామకృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రగతిరెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదరంగం క్రీడా విద్యార్థుల్లో ఏకాగ్రతను ఇనుమడింప చేస్తోందన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, కళలు వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో నాగరాజు, సుజాత, కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు పోషకాహార వస్తువులు

మహానంది, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న మూడు చెంచు గూడేల్లోని 211 మంది గిరిజనులకు పోషకాహార వస్తువులను పంపిణీ చేసినట్లు శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఉషారాణి తెలిపారు. ఆదివారం మండలంలోని మహానంది, గాజులపల్లి ఆర్‌ఎస్, ఆంజనేయపురం గ్రామాల్లోని చెంచుకాలనీ గిరిజనులకు ఒక్కో కుటుంబానికి రూ.2 వేల విలువగల పోషకాహార పదార్థాలు కల్గిన 9 రకాల వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గిరిజన ఏకోపాధ్యాయ పాఠశాల ఉపాధ్యాయుడు సుమన్ పాల్గొన్నారు.



పోషకాహార వస్తువులను పంపిణీ చేస్తున్న అధికారులు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నంద్యాల క్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కేంద్రం లోని పోలీస్ స్టేషన్లలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించా రు. నేరప్రవృత్తిని విడనాడాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచామని చెప్పారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ కుటుంబా న్ని పోషించుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగి స్తే ఊరుకునే ప్రసక్తేలేదని హెచ్చరించారు.

మహిళ అదృశ్యం

నంద్యాల క్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం పులిమద్ది గ్రామానికి చెందిన పార్శపు జయలక్ష్మి అనే మహిళ అదృశ్యమైనట్లు నంద్యాల అర్బన్ సీఐ ఈశ్వరయ్య ఆదివారం తెలిపారు. ఈ నెల 3వ తేదీ జయలక్ష్మి ఇంట్లో తన భర్త పుల్లయ్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, చుట్టుపక్కల వారిని విచారించారు. ఆచూకీ తెలియకపోవడంతో ఆదివారం భర్త పుల్లయ్య తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా

నంద్యాల క్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ కెమెరాలతో నిఘా వేసినట్లు తాలుకా ఎస్సై గంగయ్య యాదవ్ తెలిపారు. నంద్యాల ఎస్‌డీపీవో మందా జావలి అల్ఫోన్స్ ఆదేశాల మేరకు తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని నుగాలిమెట్ట, అభాండం తండా, అయ్యలూరు, బిళ్లలాపురం, పంప్‌హౌస్, చెరువుకట్ట, వివిధ వెంచర్లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించామన్నారు. బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని ఎనిమిది కేసులు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

క్రైమ్ కార్నర్

బానుముక్కలలో కార్డెన్ సెర్చ్



బానుముక్కలలో పర్యటిస్తున్న పోలీసులు

పాములపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బానుముక్కలలో ఆత్మకూరు సీఐ సురేశ్‌కుమార్‌రెడ్డి పాములపాడు ఎస్‌ఐ సురేశ్‌కు మార్‌లు పోలీస్ సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున గతంలో ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన నిందితుల ఇళ్లలో సోదా చేశారు. అలాగే తని ఖీలలో రికార్డుల్లోని 11 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో సీజ్ చేశారు. గ్రామంలో మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, మందు తాగి వాహనాలు నడిపిన జరిమానాలు తప్పవన్నారు. గ్రామాలలో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రమణ, షేక్షావలి, టవేశ్వర్, శివప్రసాద్, సుబ్బారావు, స్పెషల్ పోలీసులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గడివేముల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెసరవాయి గ్రామానికి చెందిన శివకుమార్ (31) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్‌ఐ సీసీ నాగార్జున్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. శివకుమార్ కొంతకాలంగా జల్సాలకు అలటవాటు పడి అప్పులపాలయ్యాడు. అప్పుల విషయం ఇంట్లో వాళ్లకు తెలుస్తుందేమోనని ఆందోళనతో ఈ నెల 6న గడ్డి మందు తాగాడు. వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన వరలక్ష్మి భర్త అపస్మారక స్థితిలో ఉండటంతో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక శివకుమార్ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుడిసె దగ్ధం

పాములపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోల్స్ ఆనందాపురం గ్రామంలో గుడిసె దగ్ధమైంది. ఆదివారం గ్రామంలోని ఆవర్లకు చెందిన గుడిసె నుంచి మధ్యాహ్న సమయంలో మంటలు చెలరేగాయి. దీంతో చుట్టు పక్కల ఇళ్ల వారు, గ్రామస్థులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే గుడిసె పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ.1.50 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

రేషన్ బియ్యం పట్టివేత

పగిడ్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం ప్యాకెట్లను పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని సంగయ్య పేటకు చెం దిన పగడం పక్కీరయ్య ఇంటి ముందు అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉన్నాయని సమాచారం అందడంతో పోలీసులు తనిఖీ చేశారు. 37 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని గురించి పోలీసుస్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మామిడికి తెగుళ్ల బెడద

- నేల రాలుతున్న పూత, పిందె
- రూ.లక్షల్లో నష్టం
- గగ్గోలు పెడుతున్న రైతులు

ప్యాపిలి/డోన్‌రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మా మిడికి చీడపీడల బెడద తీవ్రంగా మారింది. వందల ఎకరాల్లో పూత, పిందే నేల రాలు తుంది. మందులు వాడిన పరిస్థితి అదుపు లోకి రావడం లేదు. దీంతో ఏమి చేయాలో ది క్కుతోచక మా మిడి రైతులు తీవ్ర గుండెకోత కు గురవుతున్నారు. మండలంలో ప్యాపిలి, పోతుదొడ్డి, మాందొడ్డి, ఏనుగమర్రి, మెట్టుపల్లి, వెంగళాంపల్లి, గుడిపాడు, వెంకటాంపల్లి తది తర గ్రామాల్లో రైతులు దాదాపు వెయ్యి ఎకరాల్లో మామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. అలాగే డోన్ మండలంలో 3,500 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. రూ. వేలకు వేలు పెట్టుబడులు మామిడి తోటలను


వైరస్‌తో నేలరాలిన మామిడి పిందెలు


పోతుదొడ్డిలో పూతరాలిన మామిడి కొమ్మను చూపిస్తున్న రైతు

సంరక్షించుకుంటున్నారు. దీంతో తోటకు రైతులు ఆశించిన విధంగానే పూతలు ఆశాజనకంగా వచ్చాయి. పిందెలు కూడా బా గానే రావడంతో రైతులు మంచి దిగుబడులు వస్తాయని సంబరపడ్డారు.

తోటలను నమిలేస్తున్న తేనెమంచు వైరస్

తోటలను సోకిన చీడ, పీడలు మామిడి రైతుల కంటికి కునుకు లేకుండా చేస్తున్నాయి. తేనే మంచు వైరస్ మామిడి తోటను నాశనం చే స్తుంది. ఈ వైరస్ వలన వందలాది ఎకరా ల్లో పూత, పిందే నేల రాలుతున్నాయి. వివిధ రకా ల మందులు పిచికారి చేసిన వైరస్ అదు పులోకి రాకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన కు గురవుతన్నారు.

మామిడిపై అధిక ఉష్ణోగ్రతల ప్రభావం

మామిడి తోటలపై వైరస్‌తో పాటు అధిక ఉష్ణోగ్రతలు కూడా ప్రభావం చూ పుతున్నాయి. ఈ ఏడాది ఫి బ్రవరి మాసం నుంచే ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో వేడిమికి పూతలు, పిందెలు రాలుతు న్నాయి. ఓ వైపు వైరస్ మరో వైపు ఉష్ణో గ్రతలు తీవ్ర రూ పం దాల్చడం తో మామిడి రైతులు విలవిలలాడుతున్నారు.

సలహాలు, సూచనలు ఇస్తున్నాం



మామిడికి సోకిన తేనే మంచు వైరస్ నివారణ కు రైతులకు ఎప్పటి కప్పుడు తగిన సల హాలు, సూచనలు ఇ స్తున్నాం. ముందస్తు పూతలు వచ్చిన తోట లకు మాత్రమే వైరస్ ప్రభావం చూపుతుంది. సకాలంలో వచ్చిన పూతలు వచ్చిన తోట లకు ఏ వైరస్ సోకడం లేదు. అలాగే అధి క ఉష్ణోగ్రతలు కూడా కారణం. ఉద్యానవ న అధికారుల సలహాలు, సూచనలు తీసుకోని తోటలను కాపాడుకోవాలి.

- కళ్యాణి, ఉద్యానవనశాఖ అధికారి, ప్యాపిలి మండలం

ఇఫ్తార్‌తో పుణ్యం


రుద్రవరం జామియా మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

రుద్రవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష ఉన్నవారికి ఇఫ్తార్ ఇవ్వడం పుణ్యఫలాలు లభిస్తాయని మత పెద్దలు తెలిపారు. ఆదివారం రుద్రవరం గ్రామానికి చెందిన హుసేన్ వలి, హుసేన్‌బాషా ఉపవాస దీక్షపరులకు ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. రంజాన్‌మాసంలో ఇఫ్తార్ ఏర్పాటు చేయడం తమ అదృష్టం గా భావిస్తున్నామన్నారు. ఇఫ్తార్‌లో ఉపవాసదీక్షపరులు, మతపెద్దలు పాల్గొన్నారు.

'ఫీజు పోరు'ను విజయవంతం చేయండి

బనగానపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రాల్లో ఈనెల 12న వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'ఫీజుపోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి కోరారు. ఆదివారం బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామన్నారు. సమావే శంలో బనగానపల్లె, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, బిజేంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం ప్రారంభం

చాగలమర్రి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవంగలి గ్రామంలో ఉరుసు సందర్భంగా దస్తగిరిస్వామి దర్గాలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం కమిటీ సభ్యులు ప్రారంభిం చారు. ఐదు రోజుల పాటు దర్గా వద్దకు వచ్చే భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకుడు షబ్బీర్ తెలిపారు. ఉరుసు ప్ర శాంతంగా జరిగేందుకు గ్రామస్థులు, భక్తులు సహకరించాలని కోరారు.

'జయప్రదం చేయండి'

బేతంచెర్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : శ్మశాన వృత్తిదారుల సమస్య ల పరిష్కారం కోసం 12న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమా న్ని జయప్రదం చేయాలని కేవీపీఎస్ సీనియర్ నాయకులు వై.ఎల్లయ్య, జి.వేణుగోపాల్ కోరారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాల యంలో శ్మశాన వృత్తిదారుల సంఘం నాయకులు చిన్న మాదవకృష్ణ బొల్లి మద్దిలేటి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిం చారు. సమావేశంలో బొల్లి మధు సుధాకర్, సిమెంటునగర్ రామ సుబ్బయ్య, అంబా పురం వెంకటేశ్వర్లు, బెల్లం మురళికృష్ణ, గోపాల్, నగేష్, రేవంత్, కార్తీక్, నాగరాజు, సిమెంటునగర్ యేసురత్నం, రంగడు, నాగమధు, పోల మధు కృష్ణ పాల్గొన్నారు.

బెలుం గుహల్లో పర్యాటకుల సందడి

కొలిమిగుండ్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పర్యాటక కేంద్రం బెలుం గుహల్లో ఆదివారం పర్యాట కుల సందడి నెలకొంది. వరుసగా రెండు రోజులు సెలవు దినాలు కావ డంతో పర్యాటకులు పెద్ద ఎత్తున బెలుం గుహలకు తరలివచ్చారు. ము ఖ్యంగా విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి బెలుం గుహల అందా లను తిలకించారు.

'ఆ హక్కు ఎవరికీ లేదు'

కొలిమిగుండ్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దనే అనే హక్కు ఎవరికీ లేదని మహర్షి వాల్మీకి రిజ ర్వేషన్ ప్రజాసమితి రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌గోపాల్ అన్నారు. ఆదివారం కొలిమిగుండ్లలో ఆయన మాట్లాడుతూ ఎస్టీ రిజర్వేషన్ వాల్మీకుల హక్కు అని పవన్‌గోపాల్ అన్నారు. గతంలో ఎస్టీల్లోనే ఉన్నా మని ఇదేమీ కొత్తగా ఇచ్చేది కాదని అన్నారు. కొన్ని వర్గాల నాయకులు వాల్మీకి బోయలను పేరు ఎత్తి విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. తమ కోసం గొంతెత్తే నేతలకు వాల్మీకి జాతి యావత్తు అండగా ఉంటుందని అన్నారు.

ఘనంగా నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ

కోవెలకుంట్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుందూ నది సమీపంలోని పాటి మీద ఆంజనేయస్వామి దేవాలయంలో నవశిర నాగేంద్ర గురుపీఠ ప్రతిష్ఠ, జ్యోతి పరమేశ్వర ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రసాద్ గురూజీ ఆధ్వర్యంలో వేదపండితు లు సతీషయ్య ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠించా రు. రెండురోజులుగా శుక్ర, శనివారాలు విగ్రహ ప్రతిష్ఠకు నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవశిర నాగేంద్ర విగ్రహం ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.


నూతనంగా ప్రతిష్ఠించిన నాగదేవత విగ్రహం

వాసవీ జాగృతి క్లబ్ కార్యవర్గం ఎన్నిక

బనగానపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో వాసవీ జాగృతి క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఉ మ్మడి జిల్లాల జిల్లా గవర్నర్ గుప్తా, వైస్ ప్రెసిడెంట్ సుప్రజ, మలిపెద్ది నాగరాజు, బొగ్గరపు ధనుంజయ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. మండల అధ్యక్షురాలిగా వేముల శోభాదేవి, కార్యదర్శిగా నూకల శ్రీనివాసులు, కోశాధికారిగా చీదెల్ల లక్ష్మి ప్రసన్న, తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి శ్రీరామవెంకటసుబ్రహ్మణ్యం, గుండా రవికుమార్, గుండా శ్రీనివాసులు, వేముల రామకృష్ణ, నల్లగట్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

బనగానపల్లె, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యనకండ్ల గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఆదివారం టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు పురుషులకు ధీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళలకు కుటుంబ సభ్యులు సహకారం అందిస్తే మరిన్ని విజయాలు సాధిస్తారన్నారు. తాను ధైర్యంగా రాజకీయాల్లో రాణిస్తున్నానంటే తన భర్త బీసీ జనార్దన్‌రెడ్డి అందిస్తున్న సహకారమే అన్నారు. మహిళలకు పలు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఇంగ్లిష్‌లో చక్కగా మాట్లాడిన విద్యార్థిని ఎస్. హుస్నాను ఆమె అభినందించారు.


బహుమతులను అందజేసిన టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ

క్రీడలతో మానసిక ఉల్లాసం: కాట్రెడ్డి

కోవెలకుంట్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని టీడీపీ అధికార ప్రతినిధి కాట్రెడ్డి మల్లిఖా ర్జునరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని తిరుమల ఐటీఐ కాలేజీ ప్రాంగణంలో జరిగిన రాయలసీమ స్థాయి బాల్‌బ్యా డ్మింట న్ పోటీల్లో విజేతగా నిలిచిన బనగానపల్లెకు చెందిన సాంబ ఫైవ్స్ టీం సభ్యులకు ఆయన బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవెల కుంట్ల పట్టణంలో రాయలసీమ స్థాయి టోర్నమెంటు పోటీలు నిర్వహించడం ఆనం దాయకమన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. మరెన్నో ఇలాంటి పోటీలు జరగాలని, తన వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు,


బ్యాడ్మింటన్ విజేతలకు మెమెంటో అందిస్తున్న టీడీపీ అధికార ప్రతినిధి కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి

పెద్దవంగలిలో హుండీ లెక్కింపు


డబ్బులను లెక్కిస్తున్న సిబ్బంది

చాగలమర్రి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవంగలి గ్రామంలో దస్తగిరిస్వామి దర్గాలో హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆళ్లగడ్డ రూరల్ ఎస్‌ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో లెక్కించారు. 2024 నుంచి నేటి వరకు రూ.4.52 లక్షల నగదు, 11.6 కేజీలు వెండి, 168 కేజీల చిల్లర నాణెములను కానుకలుగా సమర్పించారు. కార్యక్ర మంలో గ్రామ సర్పంచ్ షరీఫ్, ఏఎస్‌ఐ నబీసాహేబ్, హెచ్‌సీ వెంక టరెడ్డి, వీఆర్వో శ్రీనివాసులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలకు అనుమతి లేదు

పెద్దవంగలి గ్రామంలో దస్తగిరిస్వామి ఉరుసు సందర్భంగా రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలకు అనుమతి లేదని ఆళ్లగడ్డ రూ రల్ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆదివారం చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఈనెల 12, 13న దస్తగిరిస్వామి ఉరుసు సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు, గాడిదల పోటీ ల నిర్వహణకు అనుమతులు లేవన్నారు. ఉన్నతాధికారుల ఆదేశా లను అతిక్రమించి పోటీలు నిర్వహిస్తే చట్టరీత్యా నేరమవుతుందన్నా రు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నబీసాహేబ్, పోలీసులు ఉన్నారు.

చింతలాయపల్లెలో మహిళపై దాడి

కొలిమిగుండ్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింత లా యపల్లె గ్రామంలో భూవివాదంలో కొందరు వ్యక్తులు మహిళపై దాడి చేశారు. గ్రామానికి చెందిన దూదేకుల ఇంమాబి, జైనబ్, అమీనాబి కు టుంబాలకు అంకిరెడ్డిపల్లెకు చెందిన వరలక్ష్మీ కుటుంబాల మధ్య చాలా కాలంగా భూవివాదం నెలకొంది. అయితే సదరు భూమిలో తాము సా గు చేసిన చెట్లు ఆదివారం తొలగిస్తున్నారని తెలిసి, మహిళలు అక్కడికి వెళ్లారు. ఈనేపథ్యంలో అంకిరెడ్డిపల్లెకు చెందిన ఓవ్యక్తి మహిళపై దాడి చేశారు. దీనిపై విచారణ చేపడుతున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

కుందూలో తగ్గిన నీటి ప్రవాహం

చాగలమర్రి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజోలి ఆన కట్టవద్ద కుందూ నీటి ప్రవాహం తగ్గింది. వేసవి కాలం ప్రారంభం కావ డంతో కేసీ ప్రధాన కాలువకు నీటి ని విడుదల చేసేందుకు కుందూ గేట్లను మూసి వేసినట్లు కేసీకెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. మార్చి చివరి వరకు ఆనకట్టవద్ద నీటిని సరఫరా చేస్తామని అన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

చాగలమర్రి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని గాంధీబజార్‌లో వెలసిన వీరాంజనేయస్వామికి వేద పండితుడు ప్రతాప్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఆల య అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రుద్రవరం: రుద్రవరంలో కొలువు దీరిన సంతాన వేణు గోపాల స్వా మి సత్యభామ, రుక్మిణీ అమ్మ వార్లకు ఆదివారం అర్చకులు పూజలు చేశారు. భక్తులు గీతా పారా యణం చేసి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కొండమాయపల్లె, రుద్రవరం, పెద్దకంబలూరు గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

- వైద్యాధికారి అమర్‌నాథరెడ్డి, ఆలమూరు



రుద్రవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రోగులకు మెరుగై న వైద్యసేవలు అందించడమే లక్ష్య మని ఆలమూరు వైద్యాధికారి అ మర్‌నాథరెడ్డి అన్నారు. ఎప్పటికప్పు డు గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పా టు చేస్తూ అవగాహన కల్పిస్తున్నా మన్నారు. అనారోగ్యంగా ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సం ప్రదించాలని సూచించారు. ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: ప్రతిరోజూ పీహెచ్‌సీలో ఎన్ని ఓపీలు వస్తున్నాయి?

జవాబు : 80 నుంచి 100 ఓపీలు వస్తున్నాయి.

ప్రశ్న: ఎన్ని ప్రాథమిక ఉప కేంద్రాలున్నాయి?

జవాబు : పీహెచ్‌సీ పరిధిలో ఐదు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలున్నాయి. ఆలమూరు, చిత్తరేణిపల్లె గ్రామాలతో పాటు మిగిలిన గ్రామాల్లో మరో మూడు ప్రాథమిక ఉప ఆరోగ్యకేంద్రాలున్నాయి.

ప్రశ్న: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతినెలా ఎన్ని ప్రసవాలు చేస్తున్నారు?

జవాబు : ప్రతినెలా రెండు నుంచి మూడు ప్రసవాలు జరుగుతున్నాయి. ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారా?

జవాబు : సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. శిబిరాలు నిర్వహిస్తున్నాం. కొంత అప్రమత్తంగా, పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవు.

ప్రశ్న: ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మందుల కొరత ఉందా?

జవాబు : రోగులకు అన్ని రకాల మందుల అందుబాటు ఉన్నాయి. అవసరం ఉన్న మందులు ఎప్పటికప్పుడు తెప్పిస్తున్నాం.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు

చాగలమర్రి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఆదివారం తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కమ్మ, రెడ్డి, కాపు, ఈబీసీ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ వర్గాల వారు అర్హులన్నారు. 18 నుంచి 50 సంవత్సరాల లోపు ఉన్న మహిళలకు మాత్రమే ఈ శిక్షణా తరగతులు ఉంటాయ న్నారు. 45, 60, 90 రోజుల బేసిక్ టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

రుద్రవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరంలోని పడమటివీధిలో వెలసిన ప్రతాపరుద్ర ఆంజనేయస్వామి దేవాలయ ధ్వజప్రతిష్ఠ సంబంధించి ఆదివారం ఆహ్వానపత్రికను కమిటీ సభ్యు లు ఆవిష్కరించారు. వచ్చేనెల 7నుంచి 9 వరకు ప్రతిష్ఠ పూజలు చే యనున్నట్లు తెలిపారు. భక్తులందరూ హాజరు కావాలని కోరా రు. కార్యక్రమంలో అర్చకులు వారనాసి గోపిశర్మ, మడక ప్రసాద్, మధు, నాగేంద్ర, ఇంకా పలువురు పాల్గొన్నారు.

వాల్మీకి నగర్‌లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు

కొలిమిగుండ్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని వాల్మీకినగర్‌లో ఎట్టకేలకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కాలంగా కాలనీలో విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడేవారు. దాంతో టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ పక్కీరారెడ్డి చొరవ తీసుకొని, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకవెళ్లడంతో ఆదివారం పనులు మొదలు పెట్టినట్లు టీడీపీ నాయకులు ఉలువల నరసింహుడు వెల్లడించారు. స్తంభాల ఏర్పాటుకు గుంతలు పడకపోవడంతో మంత్రి బీసీ పంపిన బోర్‌వెల్ ద్వారా గుంతలు తీశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మంత్రికి, ఐవీ పక్కీరారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పెన్షనర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

డోన్ రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పెన్షన ర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేఎస్ బానుసింగ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో కేఎస్ బానుసింగ్ మాట్లాడారు. ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాలని కోరారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం నాయకులు గాలయ్య, గోపాల్, రామసుబ్బారెడ్డి, యూటీఎఫ్ నాయకులు నరసింహులు, రామకృష్ణా రెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు క్షేమం

కొలిమిగుండ్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు చేయించుకోవడం అత్యంత క్షేమమని కొలిమిగుండ్ల పీ హెచ్‌సీ వైద్యుడు హరిచరణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మా ట్లాడుతూ కొలిమిగుండ్ల పీహెచ్‌సీలో ప్రసవాలు చేయడానికి వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారన్నారు. మండలంలోని వివిధ గ్రా మాల గర్భిణులు ఆసుపత్రిసేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో కాన్పు చేయించుకున్న వారికి ప్రభు త్వం అనేక పథకాలు వర్తింపజేస్తుందన్నారు.

అభివృద్ధి, సంక్షేమం టీడీపీ లక్ష్యం

చాగలమర్రి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, సం క్షేమం టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని బీసీసెల్ జిల్లా స్పోక్‌పర్సన్ సల్లా నాగరాజు అన్నారు. ఆదివారం చాగలమర్రి టీడీపీ కార్యాల యంలో ఆ పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీల సం క్షేమా నికి భరో సా నింపిందని అన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ నాయకత్వంలో గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువల పనులు చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్య దర్శి గుత్తి నరసింహులు, నాయకులు టైలర్‌బాష, పీరయ్య, భాస్క ర్‌రెడ్డి, రమేష్, ఓబులేసు, చోటు, మోహన్, వేణు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

- మరో ఇద్దరికి గాయాలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల)/ఉయ్యాలవాడ మార్చి 9(ఆంధ్రజ్యోతి) : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటనలు ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ మండలాల పరిధిలో ఆదివారం చోటు చేసుకున్నాయి. ఇందుకు సం బంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కడప పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మహానంది పుణ్యక్షేత్రంలో స్వామివారిని దర్శిం చుకున్నారు. తిరిగి వెళ్తుండగా కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై ఆళ్లగడ్డ మండలం చింతకొమ్మదిన్నె సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ఘట నలో సుధాకర్ అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఆళ్ల గడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాద సమాచారం తె లుసుకున్న ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. అలాగే సంజామల మండలం కానాల గ్రామానికి చెందిన మేడిగ కమలాకర్(44) గోవి దంపల్లె గ్రామంలో నిర్మిస్తున్న సోలార్ ప్లాంటులో పనులు ము గిం చు టకొని తిరిగి ద్విచక్రవాహనంలో ఇంటికి బయలు దేరాడు. ఉ య్యాలవాడ మండలంలోని మాయలూరు గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద ఉన్న మలుపు వద్ద వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న కల్వర్టు గుంతలో పడిపోయాడు. అతడికి బలమైన గాయాలు కావ టంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

50 ఏళ్ల కల.. నెరవేరిన వేళ

- తోడెండ్లపల్లెలో డ్రైనేజీ, సీసీ రహదారి నిర్మాణం


నాడు తోడెండ్లపల్లెలో బురదమయంగా ఉన్న రహదారి


నేడు గ్రామంలో నిర్మించిన డ్రైనేజీ, సీసీ రహదారి

చాగలమర్రి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోడెండ్లపల్లె గ్రామంలో 50 ఏళ్ల నాటి కల నేటి కూటమి ప్రభుత్వ హయాంలో నెరవేరింది. గ్రామంలో ప్రధాన రహదారి మురికి కుంటగా మారి దుర్వాసన వెదజల్లుతూ ప్రజలు అవస్థలు పడేవారు. గత ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, ఉసేన్‌రెడ్డి ద్వారా సమస్యను భూమా అఖిలప్రియ దృష్టికి తీసుకెళ్లారు. సీసీ రహదారులు నిర్మించి మౌలిక సదుపాయాలు మెరుగు పరుస్తామని ఇచ్చిన హామీని ఎమ్మెల్యే నేడు నిలబెట్టుకున్నారు. దాదాపు రూ.20 లక్షలు నిధులో డ్రైనేజీ, సీసీ రహదారి నిర్మించడంతో హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు టీడీపీ నాయకులు, ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

టెన్త్ విద్యార్థులకు బస్సు సౌకర్యం

డోన్ టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ పల్లె వెలుగు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అనుమతి ఇస్తూ ఆర్టీసీ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసిందని ఆర్టీసీ డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ ఆదివారం తెలిపారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 17 నుంచి 31 వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు బస్సు పాస్ లేకున్నా వారి హాల్‌టికెట్‌పై వారి గ్రామం నుంచి పరీక్ష కేంద్రానికి, పరీక్ష అయిపోయిన తర్వాత తిరిగి గమ్యస్థానానికి ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని పదవ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొక్కజొన్న పంట రక్షణకు వినూత్న ఆలోచన


రుద్రవరం మండలం హరినగరం సమీపంలో మొక్కజొన్నకు కాపలాగా ఏర్పాటు చేసిన మాస్కు బొమ్మ


హరినగరం సమీపంలో మొక్కజొన్న పంట వద్ద ఏర్పాటు చేసిన పెద్దపులి బొమ్మ

రుద్రవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు కోతు ల బారి నుంచి పంటలను రక్షించుకునేందుకు అష్టకష్టా లు పడుతున్నారు. మండలంలోని హరినగరం సమీపం లో మొక్కజొన్న పంట రైతులు సాగు చేశారు. ఆ పంట రక్షించుకునేందుకు మాస్కు బొమ్మలు, పెద్దపులిబొమ్మలు ఏర్పాటు చేశారు. వీటిని చూస్తే కోతులు దరిదాపుల్లోకి రావని రైతులు తెలిపారు. పంటను రక్షించుకునేందుకు నానా యాతన పడుతున్నామన్నారు.